క్లుప్తంగా

గ్రామ పురోహితుడికి సత్కారం



పురోహితుడు శంకరశాస్త్రిని సన్మానిస్తున్న చింతల మెరక గ్రామస్తులు

కాట్రేనికోన: కాట్రేనికోన శివారు తిమ్మాపురం శ్రీవిజయలక్ష్మీ దుర్గ నూతన ఆలయం వద్ద గ్రామ పురోహితుడు బ్రహ్మశ్రీ ఆకొండి శంకర శాస్త్రికి చింతల మెరక గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పురోహితుడు శంకర శాస్త్రికి గ్రామస్తులు నూతన వస్త్రాలు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. శంకరశాస్త్రి వంశీయులు తిమ్మాపురం గ్రామస్తులకు దశాబ్దాల కాలం నుంచి పౌరోహిత్యం చేస్తున్నారు. ప్రస్తుతం పురోహితుడు శంకర శాస్త్రి, ఆయన కుమారుడు మహేష్ శర్మలు సేవలు అందిస్తున్నారు. గెద్దనపల్లి మాజీ సర్పంచి కముజు లక్ష్మీ రమణారావు, లక్ష్మీశ్రీ బాల దంపతులు శంకర శాస్త్రికి బంగారు ఉంగరాన్ని బహూకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఆడిట్ డిపార్ట్‌మెంట్ అధికారి



విఘ్నేశ్వరుని సన్నిధిలో ఆడిట్ అధికారి చిన్నపరెడ్డి కుటుంబ సభ్యులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారిని ఏలూరు ఆడిట్ డిపార్ట్‌మెంట్ రీజినల్ డీప్యూటీ డైరెక్టర్ బి.చిన్నపరెడ్డి కుటుంబ సభ్యులతో శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చిన్నపరెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి చిత్ర పటం, ప్రసాదం అందజేశారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ



సుంకరపాలెం పంచాయతీలో పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామ పంచాయతీలో పలుచోట్ల పైపులైన్ మరమ్మతుల నేపథ్యంలో నిలిచిపోయిన తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు గ్రామ సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు తెలిపారు.

శుక్రవారం స్థానిక పాఠశాల వెనుక గల కాలనీలో పైపులైన్ మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. కనకాలపేట జంక్షన్, అయ్యప్పస్వామి గుడి ఎదురుగా ఉన్న పైపులైన్ మరమ్మతులు చేపట్టామని శనివారం నుంచి నిరాటంకంగా తాగునీరు సరఫరా అవుతుందని సర్పంచ్ నాగేశ్వరరావు తెలిపారు.

శ్మశాన స్థలాల సమస్యలను పరిష్కరించాలి

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగి, గాడిమొగ, జార్జీపేట, ఉప్పంగల, లచ్చిపాలెం పంచాయతీలలో శ్మశాన స్థలాల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయా పంచాయతీలలో స్మశాన స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను గుర్తించి శ్మశానాలకు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జయజయహే మహిషాసుర మర్దిని..!



మహిషాసుర మర్దినిగా కామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి



శాకాంబరిగా రాజరాజేశ్వరి అమ్మవారు



చినకొత్తలంకలో మహిషాసుర మర్దినిగా అమ్మవారు

ముమ్మిడివరం: దశమి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు శుక్రవారం అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలో గోదశివారిపాలెం, పల్లవారిపాలెం, చినకొత్తలంక, లక్ష్మీదేవిలంక, ఠానేల్లంక, అయినాపురం, క్రాపచింతలపూడి గ్రామాలతో పాటు పలు గ్రామాలలో అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహిషాసుర మర్దినిగా అమ్మవార్ల దర్శనం

అమలాపురం టౌన్: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా అమలాపురం పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసుర మర్దినిగా అలంకృతమై తొమ్మిదో రోజు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీదేవి మార్కెట్‌లో గల వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని వైష్ణవీ కనక దుర్గ, వాసవీ మాత, హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గ, గోల్డ్ మార్కెట్ వద్ద గల కామాక్షీ ఏకాంబరేశ్వరీ దేవి, సారవం బైపాస్ రోడ్డులోని కనకదుర్గ, కల్వకొలను వీధి వేపచెట్టు కనకదుర్గ, గోఖిలే సెంటరు కనకదుర్గ ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసుర మర్దినిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. గోల్డ్ మార్కెట్ వద్ద కామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి అమ్మవారి ఆలయం వద్ద పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

శాకాంబరిగా రాజరాజేశ్వరి అమ్మవారు

అమలాపురం రూరల్: రంగాపురంలో వేంచేసి యున్న రాజరాజేశ్వరి అమ్మవారు శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల సందర్భంగా శుక్రవారం రాజరాజేశ్వరీ అమ్మవారిని అర్చకులు ఆకు కూరలు, కూరగాయలతో అలకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

వీరేశ్వరస్వామి ఆలయంలో నేడు దసరా పూజలు

రజత చీరలో దర్శనం ఇవ్వనున్న భద్రకాళీ అమ్మవారు



భద్రకాళీ అమ్మవారు

ఐ.పోలవరం: పురాణ ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయం విజయదశమి వేడుకలకు ముస్తాబవుతోంది. దసరా ఉత్సవాల సందర్భంగా గత ఎనిమిది రోజులుగా భద్రకాళీ అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. విజయదశమి రోజు శనివారం అమ్మవారు రజిత చీరలో దర్శనం ఇవ్వనున్నారు. చివరి రోజు పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనానికి భక్తులు వచ్చే అవకాశ ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మురమళ్లలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారు నిత్య కల్యాణం, పచ్చతోరణంగా విరాజిల్లుతున్నారు. ఉగ్రరూపంలో ఉన్న వీరభద్ర స్వామి వారిని శాంతింపజేసేందు భద్రకాళి అమ్మవారు అవతరించారని భక్తుల నమ్మకం. కన్యావతారంలో ఉన్న అమ్మవారి చూసి వీరభద్రుడు శాంతించాడని పురాణాలు చెబుతున్నాయి. అనంతరం వీరిద్దరికి గాంధర్వ పద్ధతిలో వివాహం జరిగింది. ఆ ప్రక్రియ నాటి మునిమండలి (మురమళ్ల)లో జరిగిదని అప్పటి నుంచి ఇప్పటికీ వారిద్దరికీ నిత్య కల్యాణం జరగడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ కల్యాణం జరిపించుకొంటే శీఘ్రంగా వివాహం జరుగుతుందని భక్తుల విశ్వాసం. శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని ఈ ఎనిమిది రోజులు విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారికి కుంకుమ పూజలు, నిత్యం చండీ హోమం దాతల ఆర్థిక సహాయంతో జరిగింది. శ్రీచక్రాధిష్టాన దేవత శ్రీ లలితా అమ్మవారికి అహోరాత్ర సహస్రనామ పారాయణ, ఆలయంలో తొలిసారిగా లక్ష పసుపు కొమ్ములతో విశేష పూజలు జరిగాయి. విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం రజత చీరలో దర్శనం ఇవ్వనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకోనున్నారని పాలకమండలి అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దర్శనానికి ఇబ్బంది లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి ప్రసాద వితరణ, అన్నదానానికి సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



సన్నవిల్లిలో మహిషాసురమర్దిని అలంకరణలో దుర్గమ్మ అమ్మవారు

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి గ్రామంలో వేంచేసి యున్న దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రులను పురస్కరించుకుని 9వ రోజు శుక్రవారం మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహిషాసురమర్దిని అలంకరణలో...



మహిషాసురమర్దిని అలంకరణలో కనక దుర్గమ్మ

యానాం: యానాం నియోజకవర్గ శివారు సావిత్రీనగర్‌లో కొలువైన కనకదుర్గమ్మవారు శుక్రవారం మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రులను పురస్కరించుకుని తొమ్మిదో రోజు ఆలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఖడ్గమాలతో విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భాగవతి శ్రీహరిశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. యానాం, పరిసర ప్రాంతాల భక్తులు హాజరయ్యారు. పట్టణంలో కొలువైన శారదాదేవి సరస్వతీదేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానిక పడవలరేవు వీధిలో ఉన్న లలితాదేవి మహిషాసురమర్దిని అలంకరణలో పూజలందుకున్నారు. ఈ సందర్భంగా నల్లా హైమావతి బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది.



నీలపల్లిలో మహిషాసురమర్దినిగా అమ్మవారు

తాళ్లరేవు: శరన్నవరాత్రుల్లో తొమ్మిదో రోజున మహర్నవమి పర్వదినం సందర్భంగా అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో శుక్రవారం దర్శనమిచ్చారు. మండలంలోని పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో ఉన్న పాల కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు చేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. నీలపల్లిలో ఆధ్యాత్మికవేత్త కంచర్ల వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచమ నవచండీ సహిత శరన్నవరాత్ర మహోత్సవాలలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. నవకన్య పూజ, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. పాతకోరంగి బాలా త్రిపుర సుందరి సమేత కురంగేశ్వర స్వామివారి ఆలయంలో కుంకుమ పూజలు జరిగాయి. ఇంజరం కనకదుర్గమ్మ అమ్మవారిని అర్చకులు మహిషాసురమర్దినిగా అలంకరించారు.

వైభవంగా ఆర్యవైశ్య బాల పూజోత్సవం



ఆర్య వైశ్య బాలికలకు బాల పూజోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: శరన్నవ రాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం వద్ద పట్టణ ఆర్య వైశ్య సంఘం, వాసవీ మాత ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో వైశ్య బాలికలకు బాల పూజోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు.

వాసవీమాత ఆలయం వద్ద గల కల్యాణ మండపంలో ఈ పూజోత్సవాన్ని జరిపారు. ఆర్యవైశ్య గోత్రికలు 102 కావడంతో 102 మంది ఎనిమిదేళ్ల లోపు వైశ్య బాలికలకు ఈ బాల పూజా మహోత్సవాన్ని నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన బాలికలను అమ్మ వారి స్వరూపంగా భావించారు. వారి కాళ్లకు పారాణి రాసి మెడలో పుష్పమాలలు ధరింప చేశారు. పలు రకాల ఉపచారాలు చేసి అమ్మవారిని ఏ రకంగా కొలుస్తామో ఈ బాలికలను పూజించారు. పసుపు, కుంకుమ, ప్రసాదాలు సమర్పించారు. ఆర్య వైశ్య మహిళలు 102 మంది బాలికలకు ఈ పూజలు చేశారు. పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అప్పన వీరన్న, ఆర్య వైశ్య మహిళా సంఘాల ప్రతినిధులు యెందూరి సీత, నంబూరి రమా సుందరి, కొమ్మూరి సుధా రాణి, నూలు వరలక్ష్మి, కాళ్లకూరి సరిత, సింగంశెట్టి శ్రీనివాస కుమారి తదితరులు ఈ బాల పూజోత్సవాన్ని నిర్వహించారు.

బౌద్ధ ఉపాసకులు దీక్షకు హాజరు కండి



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధ విహార్ చైర్మన్ ప్రసాదరావు

అమలాపురం రూరల్: త్రిరత్న బుద్ధ విహార్‌లో అశోక ధర్మచక్ర పరివర్తన ధీవాస్ సందర్భంగా శనివారం అంబేడ్కర్ 68వ బౌద్ధ ధమ్మ దీక్షా దినోత్సవం జరుగుతుందని బుద్ధ విహార్ చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు తెలిపారు. త్రిరత్న బుద్ధ విహార్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. బౌద్ధ ఉపాసకులు, అంబేడ్కర్ వారసులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ములపర్తి సత్యనారాయణ, కాశీరామ్ బోధి, కాశీ వెంక్రట్రావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు విధిగా జీతాలు చెల్లించాలి

యానాం: పారిశుధ్య కార్మికులకు ప్రతినెలా 7వ తేదీకి జీతాలు చెల్లించాలని జాతీయ సానిటేషన్ వర్కర్స్ కమీషన్ చైర్మన్ ఎం వెంకటేషన్ నాలుగు రీజియన్‌లలోని మున్సిపల్ కమీషనర్‌లకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం పుదుచ్చేరి కలెక్టరేట్‌లో సానిటేషన్ వర్కర్స్‌కు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆది ద్రావిడ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ నుంచి అమలవుతున్న పథకాలుపై అధికారులుతో జరిగిన సమీక్షా సమావేశం కలెక్టర్ కులుంగొత్తన్ అధ్యక్షతన నిర్వహించగా అందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 7వ తేదీకి శానిటేషన్ వర్కర్స్ జీతాలు చెల్లించాలని అదేవిధంగా వారి భద్రతకు సేఫ్టీ పరికరాలు, ప్రమాద జీవిత బీమా, గుర్తింపు కార్డు, ఋణ సహాయం తదితరమైన వాటిని అందించాలని ఆదేశించారు. గుర్తింపు కార్డులో ఉద్యోగి ఈపీఎఫ్, ఈఎస్ఐ నెంబర్లు తప్పనిసరిగా నమోదు చేయాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక పరిపాలనా శాఖ డైరెక్టర్ శక్తివేలు, ఆరోగ్య కార్యదర్శి ఇలాంగొవన్, ఎస్పీ నర్రా చైతన్య, ఎమ్ కందసామి పాల్గొన్నారు.

పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎం ఋషి


ముమ్మిడివరం: భారత రిపబ్లికన్ పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఎం ఋషి పిలుపు నిచ్చారు. ముమ్మిడివరం అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఆర్పీఐ జిల్లా అధ్యక్షులు గిడ్డి జ్ఞాన ప్రకాష్ అధ్యక్షతన పార్టీ సమీక్షా సమావేశం జరిగింది. గ్రామ స్థాయి బూత్ కమిటీలు వేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు దడాల రామకృష్ణ, పి.సుధీర్, సీహెచ్ శ్రీనివాస్, పంతగడి నరసింహమూర్తి, బుడితి శరత్‌బాబు, బల్ల సత్యనారాయణ, ఎస్.బాలయోగి, తరపట్ల వెంకటేశ్వరరావు, యలమంచిలి సురేష్, రేవు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రతన్‌టాటాకు చిత్ర నీరాజనం

కాట్రేనికోన: ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతికి చిత్రకారులు ఆయనపై తమకు ఉన్న అభిమానాన్ని చిత్రలేఖనాలతో చాటుకున్నారు. విలువలు, విశ్వసనీయతే పరమావధిగా, వ్యాపారంలో లాభాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యంగా భావించి ముందుకు సాగిన మహనీయుడు రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని చిత్రకారులు అభిప్రాయ పడ్డారు. కాట్రేనికోనకు చెందిన చిత్రకారుడు ఆకొండి అంజి, బలుసుతిప్ప గ్రామానికి చెందిన యువ చిత్రకారుడు సంగాని బన్నీ, శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన 5 తరగతి విద్యార్థి మల్లాడి పార్థు రతన్ టాటాకు నీరాజనం తెలుపుతూ ఆయన చిత్రాలు గీసి నివాళులు అర్పించారు.



బలుసుతిప్పకు చెందిన చిత్రకారుడు బన్నీ గీచిన రతన్ టాటా చిత్రం



→ కాట్రేనికోనకు చెందిన చిత్రకారుడు అంజి గీచిన చిత్రం

ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని బలపరచండి

అమలాపురం టౌన్: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొర్రా గోపిమూర్తి జిల్లాలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులను శుక్రవారం కలిసి తన విజయానికి కృషి చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంప్లాయిస్ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ఉపాధ్యాయ నియోజకవర్గానికి ప్రోగ్రెసివ్ డెమాక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) మద్దతతో పోటీ చేస్తున్న గోపిమూర్తిని పరిచయం చేశారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న గోపీమూర్తి విజయానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేయాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు.